క్లుప్తంగా

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంగ్రాం మహారాజ్

నారాయణఖేడ్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఖేడ్ మండలంలోని కొండాపూర్ హనుమాన్ ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, డివిజన్, మండలాల బాధ్యులు చంద్రకాంత్, రాజయ్య, లక్ష్మణ్, చంద్రశేఖర్, కిషన్, సుదర్శన్, విష్ణు, భూమయ్య, జగదీశ్వర్, రతన్, పద్మనాభం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం

మునిపల్లి(అందోల్): ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించిన మరుసటి రోజు పంచాయతీ కార్యాలయానికి తాళం ఉండడంతో లబ్ధిదారులు దరఖాస్తు ఫారాల కోసం వచ్చి వెనుదిరుగుతున్నారు. మండలంలోని కల్లపల్లి బేల్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి శనివారం తాళం వేసి ఉందని లబ్ధిదారులు వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ-ఇన్‌ఫ్రా బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ఎలిగాంట్ నివాస పేరుతో ఈ ఇన్‌ఫ్రా బహుళ అంతస్తు భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఈ ఇన్‌ఫ్రా సంస్థ ఎండీ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణాల విషయంలో రాజీపడకుండా వినియోగదారులకు నాణ్యమైన నిర్మాణాలను చేపట్టి అందరి మన్ననలు పొందుతున్నామని తెలిపారు. 2011లో ప్రారంభమై ఈఇన్‌ఫ్రా సంస్థ ద్వారా అనేక ప్రాజెక్టులను చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్లు ప్రసాద్‌రావు, వెంకట్రామిరెడ్డి, స్నేహిత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.

19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 19మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురు, శుక్రవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందిని అదుపులోకి తీసుకొని శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19మందికి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఉపకార వేతనాలకు గడువు పెంపు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలకు జనవరి 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా పత్రాలను తీసుకోవాలని, వాటిని జనవరి 31వ తేదీన జిల్లాలోని షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ



చిందరగా ఉన్న వస్తువులు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ దుర్గం ఆలయంలోని అల్మారా తలం పగలగొట్టిన దుండగులు సౌండ్ బాక్స్ సంబంధించిన వస్తువులను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

పారదర్శకంగా 'ప్రజాపాలన'

- లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాపాలన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ, బొంబాయి కాలనీలలో శనివారం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేసి చిత్తశుద్ధి చాటుకోవాలని కోరారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధుఆదర్శరెడ్డి, పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): మండలంలోని అంతారం, పెద్దచల్మెడ, మేళసంగ్యం, మగ్దుంపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రభు, శంకర్, శ్రీనివాస్, అశోక్, పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పద్మదుర్గయ్య వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని డీపీఎం నర్సింహరావు అన్నారు. కల్హేర్ మండలం మాసాన్‌పల్లి, మీర్ఖాన్‌పేట్, రాపర్తి, సిర్గాపూర్ మండలంలోని వంగ్దల్‌లో ప్రజాపాలన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా భూగర్భ జలశాఖ పీడీ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దారు బాలశంకర్, ఎంపీడీఓలు శ్రీనివాస్, సుజాత, ఎంఓ శశాంక్, సర్పంచ్‌లు శ్రావణ్‌కుమార్, కమలమ్మ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎంపీపీ చాందీబాయి చౌహాన్ తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా శనివారం నారాయణఖేడ్ మండలంలోని చాప్టా(కె), అనంతసాగర్, పోతన్‌పల్లి(ఎం) గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో దరఖాస్తులను స్వీకరించారు. జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌చౌహాన్, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్, తహసీల్దార్ దేవదాస్, సర్పంచ్ సంగమ్మ, నాయకులు తాహెర్, పండరిరెడ్డి, మారుతి పాల్గొన్నారు.

రాయికోడ్(అందోల్): మండలంలోని పీపడ్‌పల్లి, మహమ్మదాపూర్ తదితర గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్‌పాటిల్, సర్పంచ్‌లు సంగమేశ్వర్ పాటిల్, లక్ష్మిఅనిల్, ఎంపీటీసీ కృష్ణ, ఉపసర్పంచ్ దుర్గయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దేవదాసు అన్నారు. మండల పరిధిలోని మాచ్నూర్, చీలపల్లి, కొల్లూర్, గంగాపూర్ గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ సంజీవ్‌రావు, మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్, ఏపీఓ రాజ్‌కుమార్, ఏపీయం బాలకృష్ణ, సర్పంచ్ శివరాజ్‌పాటిల్, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని 7, 8, 9 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, నల్ల శివలక్ష్మి, వడ్ల మహేశ్వరీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని సాదులనగర్, ముచ్చర్ల గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ హత్నూర డీపీఓ సురేష్ మోహన్ డీఎల్పీఓ సతీష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల పథకాల లబ్ధి కోసం అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు భాస్కర్‌గౌడ్, అనిత యాదగిరి, ఎంపీటీసీలు రాజేందర్, కిషన్‌రావు, మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రామచంద్రాపురం: భారతినగర్ డివిజన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్: ఆరు గ్యారంటీల దరఖాస్తు ఫారంలో ఇళ్లస్థలాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు చేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. సంగారెడ్డి మండల పరిధిలోని కులబ్‌గూర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణేష్, ఉపసర్పంచ్ హాశం అలీ, వార్డుసభ్యులు కృష్ణ, జావేద్, హర్షవర్ధన్, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది పాల్గొన్నారు. – జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్, రాచన్నపేట ప్రాంతంలోని 11 నుంచి 14వ వార్డుల్లో జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా క్యాంప్‌లో సరిపడ దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మందికి ఫారాలు అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగిపోయారు. ఫారాలు అందనివారు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, వైస్‌చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి దరఖాస్తులను స్వీకరించారు. శివానగర్‌లో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. గుమ్మడిదల గ్రామంలో తెలంగాణ ఉద్యమంలో అమరవీరుడైన సాయికుమార్ తల్లిదండ్రులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారు. మంబాపూర్‌లో ప్రజాపాలన సమావేశం నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు.



ఝరాసంగం: చీలపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ



జిన్నారం: బొల్లారంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి



హత్నూర: దరఖాస్తులను అందజేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్



నారాయణఖేడ్: చాప్టా(కె) గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ, అధికారులు

దరఖాస్తులు విక్రయిస్తే చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం దరఖాస్తు ఫారాలు జిరాక్స్ కేంద్రాలు, ఇతర దుకాణాల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను వార్డు అధికారులు గడపగడపకు వచ్చి ఇస్తారని చెప్పారు. ఎవరైనా బయట విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే ఆయా దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దరఖాస్తు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ప్రజలు వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతిఒక్కరికీ క్షేత్రస్థాయిలో దరఖాస్తులను అందజేస్తున్నామని పేర్కొన్నారు.

సంగ్రాం మహారాజ్‌కు సన్మానం

నారాయణఖేడ్: మండల పరిధిలోని కొండాపూర్ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్‌ను శనివారం ఆశ్రమంలో ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్ కలిసి ఘనంగా సన్మానించారు. అయోధ్యలో ఈనెల 22న నిర్వహించనున్న రామాలయ ప్రారంభోత్సవంలో భాగంగా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సంగ్రాం మహారాజ్‌ను ఆహ్వానించడం ఖేడ్ ప్రాంతానికి దక్కిన గౌరవం అని కొనియాడారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నారాయణఖేడ్: ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణఖేడ్‌లోని సాహితి, వాగ్దేవి జూనియర్ కళాశాలల్లో శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ సంఘం 1970లో కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఏర్పడిన నాటినుంచి నేటివరకు అధ్యయనం, పోరాటం, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో నిరంతరం విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నామని తెలిపారు. సంఘం జిల్లా, డివిజన్ నాయకులు సతీష్, పవన్, రాహుల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించండి



సంగారెడ్డి ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

నారాయణఖేడ్: విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఖేడ్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఖేడ్ నగర కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మనీపాసుల కోసం విద్యార్థులు డబ్బులు చెల్లిస్తున్నా అవస్థలు తప్పడంలేదన్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పండు, శివ, శంకర్, కార్తీక్, విజయ్, పవన్, రాకేష్ పాల్గొన్నారు.

సంగారెడ్డి అర్బన్: ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్ అన్నారు. ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బస్ డిపో ఎదుట శనివారం విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణానికి వివిధ గ్రామాల నుంచి అనేకమంది విద్యార్థులు చదువుకోవడానికి వస్తుంటారన్నారు. బస్సుపాసుల డబ్బులను చెల్లించినప్పటికీ విద్యార్థులు బస్సులు రద్దీగా ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ శారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి, విభాగ్ హాస్టల్ కన్వీనర్ తానాజీ, దినేష్, శశాంక్, నిఖిల్, వెంకటరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో మాక్ పోలింగ్



ఓటు వేస్తున్న విద్యార్థినులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్, కౌంటింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం కవిత పర్యవేక్షణలో మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఎమెల్యే పదవికి నామినేషన్లు, నామినేషన్ల తిరస్కరణ, విత్‌డ్రా పోటీలో నిలిచిన వారికి గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులంతా ఓటు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల హక్కుల కోసం పోరాటం



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మాదిగల ఏబీసీ వర్గీకరణే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని ఆ సంఘం జాతీయ అధికార ప్రతినిధి బుర్ర భిక్షపతి అన్నారు. మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామ శివారులోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి సదస్సులో భిక్షపతి మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవం హక్కులు కోసం ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి కల్హేర్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక తనిఖీ నివేదికను డీఆర్‌పీలు ప్రజావేదికలో బహిర్గతం చేస్తారని తెలిపారు.

పరామర్శ

హత్నూర(సంగారెడ్డి): అనారోగ్యానికి హత్నూర సర్పంచ్ వీరస్వామిగౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీటీసీ ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు సుధాకర్, రాంరెడ్డి, వార్డుసభ్యులు ఆసిఫ్, నాయకులు బుచ్చిరెడ్డి, యాదయ్య, పోశెట్టి, రాజు, లింగం ఉన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

రాయికోడ్(అందోల్): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, రోడ్లపై కేకులు కట్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. యువత సూచనలు పాటించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశానికి బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ పర్యవేక్షకులు భీమయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి ఆరో తేదీలోగా రూ.100 చెల్లించి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో తెలుగుకు 20 మార్కులు, ఇంగ్లీష్‌కు 25, గణితంకు 25, మెంటల్ ఎబిలిటీకి 10 మార్కులు కలిపి మొత్తం 100 మార్కులతో కూడిన ప్రశ్నాపత్రం ఉంటుందన్నారు. దరఖాస్తులు ఆన్లైన్‌లో ht-t-i://-tfcet.-c-f-f.-g-o-vi n ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు దగ్గరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న మహేష్, నాయకులు

జోగిపేట(అందోల్): భారత విద్యార్థి ఫెడరేషన్ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని జోగిపేట ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో 54 సంవత్సరాలుగా విద్యార్థులను, ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. భగత్‌సింగ్, సావిత్రి బాయి, అంబేడ్కర్ వంటి మహనీయుల స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు ఎస్ఎఫ్ఐ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు స్రవంతి, అఖిల, అనూష, రేణుక, గణేష్, సందీప్, వేణు శైలజ,శివ కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు



శబరిమలకు తరలి వెళ్తున్న అయ్యప్ప స్వాములు

హత్నూర(సంగారెడ్డి): మండలం తహర్ఖాన్ పేట గ్రామంలో అయ్యప్పస్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చంద్రగౌడ్ కుమారుడు మహేష్ గౌడ్ అయ్యప్పస్వామి ఏర్పాటు చేసిన 18 కలిశాల అయ్యప్పస్వామి మహాపడిపూజను గంగాధర్ గురుస్వామి, కన్నయ్య గురుస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ నర్సింహులు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సదాశివపేట పట్టణంలో..

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నుంచి శనివారం మధ్యాహ్నం శబరిమల యాత్రకు అయ్యప్పస్వాములు తరలివెళ్లారు. గురుస్వామి సుధాకర్‌గౌడ్, గోనేశంకర్, రవీందర్ గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు దుర్గభవాని మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శబరిమలకు వెళ్లారు.

ఊట్ల గ్రామం నుంచి..

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్ల గ్రామం నుంచి అయ్యప్పస్వాములు శబరిమలకు తరలివెళ్లారు. అంతకుముందు అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

యువతి అదృశ్యం



కృష్ణవేణి



నిఖిత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో యువతి అదృశ్యమైంది. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారంలో నివాసం ఉంటున్న చొన్నబోయిన మన్యం కుమార్తె కృష్ణవేణి ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని కాలేజీకి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కృష్ణవేణి ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవటంతో ఆమె తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాలేజీకి వెళ్తున్నానని చెప్పి మరో విద్యార్థిని..

కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఓ యువతి ఇంటికి తిరిగి రాలేదు. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారానికి చెందిన నారాయణగౌడ్ కుమార్తె నిఖిత ఈ నెల 29న కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటికి రాలేదు. దీంతో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నారాయణగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అల్మార పగలగొట్టిన దృశ్యం